
నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I హైదరాబాద్, గురువారం 26 డిసెంబర్ 2024 HYDERABAD



## చిరు జల్లులు..చల్లని గాలులు

సిటీబ్యూరో: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో బుధవారం గ్రేటర్‌లోని పలు చోట్ల తేలిక పాటి జల్లులు కురిశాయి. వాన జల్లుకు గాలులు కూడా తోడవ్వడంతో పగలూ చలి వణికించింది. రాగల రెండు రోజులు గ్రేటర్‌లో తేలికపాటి వాన కురిసే అవకాశాలున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.




# హెచ్ఎండీఏకు ఏమైంది?

## ఏడాది కాలంగా ఒక్క ప్రాజెక్టూ పట్టాలెక్కలే

● అధికారులు మారినా.. ఆచరణలోకి రాని అభివృద్ధి ప్రణాళికలు ● కనీసం పెండింగ్ ప్రాజెక్టులనూ పూర్తి చేయలేని వైనం

సిటీబ్యూరో, డిసెంబర్ 25(నమస్తే తెలంగాణ) : హెచ్ఎండీఏ పనితీరు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కొత్త ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచినా... ఏ ఒక్క ఐకానిక్ ప్రాజెక్టును పట్టాలెక్కించలేకపోయింది. ముఖ్యంగా హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా తీర్చి దిద్దడంలో కీలకపాత్రను పోషించే హెచ్ఎండీఏ.. ఆ దిశగా ఏ ఒక్క ప్రాజెక్టుకు కూడా డిజైన్ చేయలేదు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల తర్వాత మార్చిలో రెండు ఎలివేటెడ్ కారిడార్లకు శంకుస్థాపన చేసింది కానీ, ఇందులో ఏ పురోగతి లేదు. ఏడు జిల్లాల పరిధిలో విస్తరించిన హెచ్ఎండీఏ.. మౌలిక వసతులను కల్పించాల్సి ఉన్నా... ప్రాజెక్టులను మొదలుపెట్టడం లేదు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి ఏడాదిలో హెచ్ఎండీఏ పాత్ర శూన్యంగా మారింది.


కొత్వాల్‌గూడ ఏకో పార్క్

### ఇంకా పూర్తికాని కొత్వాల్‌గూడ ఏకో పార్క్

హెచ్ఎండీఏలో అభివృద్ధి ప్రాజెక్టులకు పక్కన పెట్టేశారు. గతంలో మాదిరి మోస్ట్ హ్యాపినింగ్ సిటీగా మార్చేందుకు అహర్నిశలు కృషి చేసిన హెచ్ఎండీఏ అధికారులు... ప్రస్తుతం పెండింగ్ పనులపై దృష్టి పెట్టడం లేదు. చేతిలో భారీ ప్రాజెక్టులు ఉన్నా... నివేదికలు, అధ్యయనాలతో పనులు మొదలుపెట్టడమే లేదు. ఇక అర్ధాంతరంగా నిలిచిన ప్రాజెక్టు పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇక ఏడాది ఆరంభంలోనే అందుబాటులోకి రావాల్సిన కొత్వాల్‌గూడ ఏకో పార్క్ ఇప్పటికీ నిర్మాణం పూర్తి చేయలేకపోయారు. గతంలో ప్రతిపాదించిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను కూడా పట్టాలెక్కించడంలో కాలయాపన చేస్తున్నారు. దీంతో మెట్రోపాలిటన్ నగరంలో అభివృద్ధి కుంటుపడుతున్నది.

### అన్ని పెండింగ్‌లోనే...

కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి ప్రాజెక్టుల పరిస్థితి దారుణంగా మారింది. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా... ప్రాజెక్టుల్లో పురోగతి లేకుండా పోయింది. కోట్లు వెచ్చించి గత ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులను కూడా పూర్తి చేసేలా ఉన్నతాధికారులు దృష్టి పెట్టడం లేదు. కనీసం ప్రభుత్వం వాటిని పట్టించుకున్న పాపాన పోలేదు. హైదరాబాద్ టూరిజానికే తలమానికంగా నిలవనున్న కొత్వాల్‌గూడ ఏకో పార్క్ నిర్మాణంపై హెచ్ఎండీఏలో నిర్లక్ష్యం ఆవహించింది. ఓపెన్ ఎయిర్ థియేటర్, ఎంట్రెన్స్ ఆర్చ్, ఓపెన్ ప్లాజా, అప్రోచ్ రోడ్డు, ల్యాండ్ స్కేపింగ్, గ్రీనరీ వంటి పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వం పెండింగ్ పనులపై దృష్టిపెట్టకపోవడంతో ప్రాజెక్టులకు తుది రూపం రావడం లేదు. ఇక పెండింగ్‌లోనే పలు అభివృద్ధి పనులు ఉండగా.... కొత్తగా ప్రతిపాదించిన రెండు ఎలివేటెడ్ కారిడార్లు, మీరాలం కేబుల్ బ్రిడ్జి వంటి ప్రాజెక్టులు కూడా కాగితాలకే పరిమితమైంది. వీటి డిజైన్లు అన్ని సిద్ధం గానే ఉన్నప్పటికీ... ప్రాజెక్టులపై కన్సల్టెన్సీలను నియమించి అధ్యయనం పేరిట కాలయాపన చేస్తోంది.

## సంధ్య థియేటర్ ఘటనపై..
# తప్పుడు పోస్టులు పెట్టొద్దు

తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు
నగర పోలీసుల హెచ్చరిక

సిటీబ్యూరో, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఇటీవల సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాట ఘటనపై సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టినా లేక ప్రజలను అపోహలకు గురిచేసే విధంగా కామెంట్లు చేసినా కఠిన చర్యలు తప్పవని నగర పోలీసులు హెచ్చరించారు. అల్లు అర్జున్ రాకముందే థియేటర్‌లో తొక్కిసలాట జరిగినట్లు కొందరు తప్పుడు వీడియోలను పోస్టు చేయడం తాము గుర్తించామని, జరిగిన ఘటనపై వాస్తవాలకు సంబంధించిన వీడియోలను ఇప్పటికే పోలీసు శాఖ ప్రజల ముందు ఉంచినప్పటికీ కొందరు పనిగట్టుకొని ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ పోలీసు శాఖను బద్నాం చేసేలా తప్పుడు ప్రచారం చేసే వారిని ఉపేక్షించేది లేదని, వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## అరుదైన జాబితాలో
# నక్షత్ర తాబేళ్లు

వాటిని విక్రయిస్తే..జైలుకే
అక్వేరియం..ఇండ్లలో పెంచినా.. నేరమే

సిటీబ్యూరో:నక్షత్ర తాబేళ్లు...మార్కెట్లో ఒక్కో తాబేలు ఖరీదు పరిమాణం ఆధారంగా రూ.25వేల నుంచి 50వేల వరకు ఉంటుంది. అయితే మార్కెట్లో వీటికి ఉన్న డిమాండ్‌ను కొందరు స్మగ్లర్లు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఏపీ, కేరళ, ఒడిశా, తమిళనాడు ప్రాంతాల్లోని సముద్ర తీర ప్రాంతాల నుంచి నక్షత్ర తాబేళ్లు, రెడ్ ఇయర్డ్ స్లైడర్ తాబేళ్లను తీసుకువచ్చి కొందరు స్మగ్లర్లు గుట్టచప్పుడు కాకుండా వ్యాపారం చేస్తున్నారు. సాధారణంగా ఈ తాబేళ్లు చాలా అరుదుగా కనిపిస్తుంటాయని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. అందుకని అరుదైన నక్షత్ర తాబేళ్లను అక్వేరియంలోగాని, ఇండ్లలో గాని పెంచడం వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్ 1972 చట్టం ప్రకారం నేరమని హైదరాబాద్ ఈస్ట్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అరుణ తెలిపారు.

### ఎందుకంత డిమాండ్ అంటే....

సాధారణంగా నక్షత్ర తాబేళ్లకు మార్కెట్లో, విదేశీ మార్కెట్లో చలా డిమాండ్ ఉంది. దీనికి ప్రధాన కారణం ప్రజల్లో వీటిపై ఉన్న సెంటిమెంట్. నక్షత్ర తాబేళ్లు ఇళ్లలో, కార్యాలయాల్లో ఉంటే ఆర్థికంగా కలిసి వస్తుందని, ఆరోగ్య పరంగా కూడా అన్ని విధాలా మంచి జరుగుతుందనేది ప్రజల విశ్వాసం. దీనిని ఆసరాగా చేసుకుని కొన్ని స్మగ్లింగ్ ముఠాలు అరుదుగా కనిపించే నక్షత్ర తాబేళ్లు, రెడ్ ఇయర్డ్ స్లైడర్ తాబేళ్లను పట్టుకుని ఇతర ప్రాంతాలకు స్మగ్లింగ్ చేస్తున్నారు.

### ఎలా పట్టుకుంటారు..

దేశంలోని కొన్ని సముద్ర తీర ప్రాంతాల్లో ఈ తాబేళ్లు కనిపిస్తుంటాయి. ముఖ్యంగా ఒడిశాచ, కేరళ, తమిళనాడు, ఏపీ ప్రాంతాల్లోని సముద్ర తీర ప్రాంతాల్లో ఈ తాబేళ్లు కనిపిస్తుంటాయి. అయితే ఇవి గుడ్లు పెట్టే సమయంలో బయటకు వస్తాయని, గుడ్లు పొదిగిన తరువాత అవి సముద్రంలోకి వెళ్లే సమయంలో వేటగాళ్లు కాపుకాచి ఈ నక్షత్ర తాబేళ్ల పిల్లలను పట్టుకుని వ్యాపారం చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే నగరంలో గుట్టుచప్పుడు కాకుండా నక్షత్ర తాబేళ్లను విక్రయిస్తున్న ముఠాను అటవీశాఖ, మల్కాజిగిరి ఎస్‌వోటీ పోలీసులు సంయుక్తంగా కలిసి దాడులు జరిపి పట్టుకున్నారు.

### మార్కెట్లో విక్రయిస్తే జైలుకే

- అరుణ (హైదరాబాద్ ఈస్ట్ ఎఫ్ఆర్‌వో)

అరుదైన నక్షత్ర తాబేళ్లను మార్కెట్లో విక్రయించడం చట్టరీత్యా నేరం. నక్షత్ర తాబేళ్లను ఇండ్లు, కార్యాలయాలు, వ్యాపార సంస్థల్లో పెట్టుకుంటే ఆర్థికంగా కలిసి వస్తుందనేది ఒక మూఢ నమ్మకం మాత్రమే. ఇలాంటి నమ్మకాలతో స్వేచ్ఛగా జీవించాల్సిన జంతువులు, పక్షులు అంతరించిపోతున్నాయి. ఈ మూఢ నమ్మకాలతోనే ఇప్పుడు నక్షత్ర తాబేళ్లు సైతం అరుదైన జీవరాశుల జాబితాల్లో చేరాయి. ప్రజల నమ్మకాన్ని కొందరు స్మగ్లర్లు స్వేచ్ఛగా బతకాల్సిన జీవరాశులతో వ్యాపారం చేస్తూ సొమ్ము చేసుకుంటూ వాటి పతనానికి కారణమవుతున్నారు. దీనిపై ప్రజలు అవగాహన పెంచుకొని జీవరాశులను కాపాడాలి.

# దావత్ విత్‌ఔట్ దారు

## కొత్త ఏడాది ముగింపు మద్యంతో వద్దు
### ఫౌండర్ చెగొండి చంద్రశేఖర్

సిటీబ్యూరో, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ) : డిసెంబర్ 31 వస్తుందంటే చాలు.. పార్టీలపైనే చర్చ. స్నేహితులు, బంధువులు అందరూ కలిసి వేడుక చేసుకోవడానికి ఉత్సాహం చూపిస్తుంటారు. అయితే చాలా వరకు డిసెంబర్ 31 పార్టీని దారుతోనే సెలబ్రేట్ చేస్తుంటారు. అయితే దారు లేకుండా పార్టీ చేసుకోవాలని 'దావత్ విత్‌ఔట్ దారు' టీం సభ్యులు సోషల్ మీడియాలో అవగాహన కల్పిస్తున్నారు. మద్యం తాగి చేసుకునే వేడుక ఎప్పటికీ మంచిది కాదనీ.. మద్యానికి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. ఈ సందర్భంగా ఫౌండర్ చెగొండి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. మద్యం లేకుండా పార్టీ చేసుకోవడానికి ఆసక్తి చూపిస్తున్న వారి సంఖ్య పెరుగుతోందని.. దారు లేకుండా జరిపే పార్టీల ఫొటోలు తీసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తున్నారని వివరించారు. రాబోయే డిసెంబర్ 31 వేడుకల్లో మద్యం సేవించి ఇబ్బందులు ఎదుర్కోవద్దని హితవు పలికారు. కాగా, 'దావత్ విత్‌ఔట్ దారు' టీం సభ్యులు దావత్ విత్‌ఔట్ దారుపై ప్రజలకు అవగాహన సైతం కల్పిస్తుండటం విశేషం.



ఇక్కడ చెత్త వేస్తే..జరిమానా వేస్తామని బోర్డు పెట్టినా.. వ్యర్థాలు వేసిన వైనమిది. చిలుకానగర్ రోడ్డులో కనిపించిన దృశ్యమిది.

# నక్షత్ర తాబేళ్ల స్మగ్లింగ్

ముఠా గుట్టు రట్టు..ఇద్దరు వ్యక్తులు అరెస్టు
రూ.64 లక్షల విలువ చేసే 441 తాబేళ్లు స్వాధీనం

సిటీబ్యూరో: నిబంధనలకు విరుద్ధంగా నక్షత్ర తాబేళ్లు, రెడ్ ఇయర్డ్ స్లైడ్ తాబేళ్లు విక్రయిస్తున్న ముఠా గుట్టును రాచకొండ పోలీసులు రట్టు చేశారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేయగా మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. పోలీసుల కథనం ప్రకారం...పీర్జాదిగూడ, ఆదర్శనగర్‌కు చెందిన షేక్ జానీ స్థానికంగా 'ఫేమస్ అక్వేరియం' పేరుతో రకరకాల చేపలు, పక్షులను విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలో నిబంధనలకు విరుద్ధంగా తాబేళ్లను కూడా విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న మల్కాజిగిరి ఎస్‌వోటీ పోలీసులు ఫేమస్ అక్వేరియం దుకాణంపై దాడులు జరిపారు. ఈ దాడుల్లో 5 నిషేధిత నక్షత్ర తాబేళ్లను స్వాధీనం చేసుకుని ఉప్పల్ ఎఫ్ఆర్‌వో అధికారికి సమాచారం అందించారు. రంగంలోకి దిగిన ఎఫ్ఆర్‌వో.. తాబేళ్లను మార్కెట్లో విక్రయించడం చట్ట విరుద్ధమని ధ్రువీకరించడంతో పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, ఓల్డ్ మలక్‌పేటకు చెందిన 'న్యూ షైన్ అక్వేరియం' నిర్వాహకుడైన సిరాజ్ అహ్మద్ అనే వ్యక్తి వద్ద ఈ తాబేళ్లను కొనుగోలు చేసినట్లు వెల్లడించాడు. దీంతో పోలీసులు, ఎఫ్ఆర్‌వో బృందంతో కలిసి మలక్‌పేటలోని సిరాజ్ దుకాణంపై దాడులు జరిపి.. అతడి రహస్య గోదాంలో ఉన్న 281 నక్షత్ర తాబేళ్లు, 160 రెడ్ ఇయర్డ్ స్లైడర్ తాబేళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్ 1972 చట్టం ప్రకారం నిందితులిద్దరిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ. 64 లక్షల విలువ చేసే 441 తాబేళ్లను స్వాధీనం చేసుకొని అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. అయితే సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఏపీకి చెందిన విజయ్‌కుమార్ అనే వ్యక్తి సొంత రాష్ట్రం నుంచి ఈ తాబేళ్లను నగరానికి స్మగ్లింగ్ చేసి సిరాజ్‌కు విక్రయిస్తున్నట్లు నిందితులు పోలీసుల విచారణలో వెల్లడించారు. ఈ మేరకు పోలీసులు విజయ్‌కుమార్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. తదుపరి విచారణ కోసం కేసును హైదరాబాద్ ఈస్ట్ ఫారెస్ట్ ఆఫీసర్ అరుణకు అప్పగించారు.

సికింద్రాబాద్ సెయింట్ మేరీ చర్చి..





# క్రీస్తు జననం.. అంబరాన్నంటిన సంబురం

● సిటీలో వైభవంగా క్రిస్మస్ వేడుకలు ● చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు..ఆధ్యాత్మిక గీతాలాపనలు



సిటీబ్యూరో, డిసెంబర్ 25 ( నమస్తే తెలంగాణ ) : కొవ్వొత్తుల వెలుగులు.. క్రిస్మస్ తాత బహుమతులు.. కేక్ మిక్సింగ్ సందడి.. ప్రార్థనలు.. విందులూ.. వినోదాలు.. ఇలా క్రిస్మస్ సంబురాలు బుధవారం నగరవ్యాప్తంగా అంబరాన్నంటాయి. సెయింట్ జాన్ ది బాప్టిస్ట్, సెయింట్ మేరీస్ చర్చి, సెయింట్ థామస్, ఆల్ సెయింట్ చర్చి, మిలీనియం మెథడిస్ట్, వెస్లీ, హోలీ ట్రినిటీ, గ్యారిసన్ వెస్లీ తదితర ప్రాచీన చర్చీలు రంగు రంగుల విద్యుద్దీపాలతో కళకళలాడాయి. క్రిస్మస్ ట్రీలు, శాంతా క్లాజ్‌లు ఆకట్టుకున్నాయి. పండుగను పురస్కరించుకొని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ప్రత్యేకంగా క్రీస్తు గీతాలను ఆలపించారు. మరోవైపు క్రిస్మస్ సంబురాల్లో విభిన్న రకాల కేకులు ప్రత్యేకతను చాటుకున్నాయి.

## అధునాతన ఫీచర్లతో..
# మెట్రో యాప్

మెట్రో కార్డు ఇబ్బందులపై కదలిన యంత్రాంగం
ఫిజికల్ కార్డు లేకున్నా.. యాప్ ద్వారా యాక్సెస్ చేసేలా డిజైన్

సిటీబ్యూరో: ఎట్టకేలకు హైదరాబాద్ మెట్రో కోసం ప్రత్యేక యాప్‌ను డిజైన్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇన్నాళ్లు మెట్రో కార్డు ద్వారా రాయితీలతో కూడిన రవాణా సౌకర్యం కల్పించగా... ఫిజికల్ కార్డు వెంట పెట్టుకుని తిరగాల్సి వచ్చేది. ఒకవేళ కార్డు డ్యామేజీ జరిగినా.. మరిచిపోయినా కచ్చితంగా టికెట్ కొనాల్సిన పరిస్థితి ఉండేది. ఇలాంటి ఇబ్బందుల నేపథ్యంలోనే ఫిజికల్ కార్డుతో పనిలేకుండా, మరింత సులభంగా మెట్రో యాక్సెస్ చేసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కొంతకాలంగా వినియోగదారులు కోరుతున్నారు. ఈ మేరకు మెట్రో టెక్నికల్ విభాగం ఆ దిశగా అడుగులు వేస్తున్నది. ప్రస్తుతం ఢిల్లీ మెట్రో తరహాలో యాప్ బేస్డ్ విధానం అమల్లో ఉండగా... అదే తరహాలో ప్రస్తుతం ఉన్న టీ సవారీ యాప్ కంటే అధునాతన ఫీచర్లను జోడించనున్నారు. ఈ క్రమంలో కార్డుతో సంబంధం లేకుండా నేరుగా రాకపోకలు చేసుకునేలా తీర్చిదిద్దనున్నారు. ఏటీఎం కార్డు లేకున్నా... మొబైల్ యాప్‌లోని డబ్బు చెల్లింపులు జరుగుతున్నట్లుగానే అదే విధానాన్ని మెట్రో మొబైల్ యాప్‌లోనూ వినియోగించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిధంగా కార్డు రీచార్జ్ కూడా సులభంగా చేసుకునేలా ఫీచర్లతో కొత్త మెట్రో మొబైల్ యాప్ ఉంటుందని, దీనికి సంబంధించిన అధ్యయనం పూర్తయినట్లు తెలిసింది.



### ఫిబ్రవరి లేదా మార్చి..

వచ్చే ఏడాది ఫిబ్రవరి లేదా మార్చి నెల్లో ఈ యాప్ అందుబాటులోకి తీసుకువచ్చేందుకు హెచ్ఎంఆర్ఎల్ ప్రయత్నిస్తోంది. ప్రస్తుతం ఢిల్లీ మెట్రో రూపొందించిన యాప్ డిజైన్లతో పాటు, ఇతర యాప్‌లను అధ్యయనం చేసి.. నగర మెట్రో వాసులకు అధునాతన సేవలను అందించనున్నారు. హైదరాబాద్ మెట్రోకు క్రమంగా ఆదరణ పెరుగుతున్నది. నిత్యం 4.5 లక్షల నుంచి 5 లక్షల మంది రాకపోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మెట్రో ప్రయాణాన్ని మరింత సులభతరం చేసేందుకు ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలను అందుబాటులోకి తీసుకువస్తామని మెట్రో వర్గాలు చెబుతున్నాయి.